క్లుప్తంగా

వీసీలను త్వరగా నియమించండి

తిరుపతి సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వ విద్యాలయాలలో పాలన కుంటుపడిందని వీసీల నియామకం త్వరగా చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాదాపు నెల రోజుల నుంచి వర్సిటీలలో రిజిస్ట్రార్‌లు, వీసీలు లేని కారణంగా యూఆర్‌సీ, పీహెచ్‌డీ వైవాలు జరగలేదని, దీంతో ఎంతో మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి ఈ విషయంపై తక్షణం స్పందించి వర్సిటీలకు వీసీలను నియమించాలని కోరారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించడానికి పబ్లిక్ గ్రీవెన్ రిడ్రెస్సల్ సిస్టంను సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునేందుకు ఇదో అవకాశమని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వాల్మీకిని దర్శించుకున్న ఎంపీ


వాల్మీకిని దర్శించు కుంటున్న ఎంపీ

తిరుపతి కల్చరల్: అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ ఆదివారం కపిలతీర్థం సమీపంలోని వాల్మీకి ఆలయానికి విచ్చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన ఆయన కాలినడకన తిరుమల చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కపిలతీర్థం వద్దనున్న వాల్మీకి ఆలయానికి విచ్చేసిన ఆయనకు తిరుమల, తిరుపతి వాల్మీకుల వెల్ఫేర్ ఫౌండేషన్ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం కల్పించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో నాగరాజు, నారాయణ, మహేష్‌కుమార్, తలారి బాలయ్య, నగేష్ ఉన్నారు.

16న ఆణివార ఆస్థానం

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి, శ్రీకోదండరామాలయంలో 16న మంగళవారం ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. గోవిందరాజస్వామి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారిని వేంచేపు చేసి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీపుండరీక వల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా తీసుకువచ్చి శ్రీగోవిందరాజస్వామికి సమర్పిస్తారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆలయంలోని గరుడాళ్వార్ ఎదురుగా సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరాముల వారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ప్రత్యేకంగా ఆస్థానం నిర్వహిస్తారు.

శిథిలావస్థలో బస్సు షెల్టర్లు

- వేచివుండాలంటే తప్పని ఇక్కట్లు


తొండమనాడు వద్ద ద్విచక్రవాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిన బస్సు షెల్టర్

శ్రీకాళహస్తి రూరల్: తిరుపతి –శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలోని బస్సు షెల్టర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు ప్రస్తుతం ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారాయి. శ్రీకాళహస్తి మండలంలోని హౌసింగ్ సొసైటీ కాలనీ వద్ద ఉన్న బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. తొండమనాడు ప్రధాన రహదారిపై ఉన్న బస్సు షెల్టర్ నిరుపయోగంగా మారి ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. వాన, ఎండ తాకిడికి గురికాకుండా బస్సు సర్వీసు కోసం ప్రయాణికులు వేచి ఉండేందుకు నిర్మించిన బస్‌షెల్టర్లను మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్లు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



హౌసింగ్ సొసైటీ కాలనీ వద్ద శిథిలావస్థలో బస్సు షెల్టర్

పేరుకే పెద్ద బస్టాండ్

తిరుపతి ఆధ్యాత్మిక నగరమే కాకుండా జిల్లా కేంద్రం కూడా. ఈ నేపథ్యంలో తిరుపతిలో సెంట్రల్ బస్టాండ్ ఒకే ప్రాంగణంలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లె వెలుగు పేరుతో నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. 11.5 ఎకరాల విస్తీర్ణంలోని ఈ బస్టాండ్‌లకు 64 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. జిల్లాలోని 11 డిపోల నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి తదితర అన్ని ప్రాంతాలకు తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి సర్వీసులు నడుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజుకు 5.75లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటే.. తిరుపతి బస్టాండ్ నుంచి 2 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ బస్టాండ్‌లో సమస్యల కారణంగా ప్రయాణికులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

– తిరుపతి అర్బన్

- అధ్వానంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్
- కనీసం పార్కింగ్ సౌకర్యాలు కరువు
- ఆదాయం వైపే అడుగులు.. వసతులు పట్టవు
- పది నిమిషాలు పార్కింగ్ చేయాలన్నా తిప్పలు
- వాహనాలకు భద్రత అంతంతమాత్రమే
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు


తిరుపతి సెంట్రల్ బస్టాండ్

తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో వాహనాలను పార్కింగ్ చేయడానికి రెండు పార్కింగ్ ప్రదేశాలున్నాయి. ఈ బస్టాండ్‌కు పలువురు తమ తల్లిదండ్రులు, బంధువులను బస్సు ఎక్కించడానికి లేదా బస్టాండ్‌కు వస్తే వారికి తీసుకుపోవడానికి రోజుకు 10 వేల నుంచి 20 వేల మంది వచ్చిపోతుంటారు. ఈ క్రమంలో పది నుంచి 20 నిమిషాలు బస్టాండ్ ప్రాంగణంలో తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి సరైన ప్రదేశం లేదు. 10 నిమిషాలు పార్కింగ్ చేయడానికి ఆర్టీసీ పార్కింగ్ ప్రదేశంలో అద్దె చెల్లించి పెట్టలేరు. పార్కింగ్ చేయడానికి సరైన ప్రదేశం లేదు. దీంతో నానా తిప్పలు పడుతున్నారు.

ఖాళీ ప్రాంతంలో కట్టుదిట్టం

తిరుపతి బస్టాండ్ ముందు భాగంలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో పార్కింగ్ చేయనీయకుండా ఆర్టీసీ అధికారులు ఇటీవల కట్టుదిట్టం చేశారు. బస్టాండ్ ముందు భాగంగా ఖాళీ స్థలం ఉన్నా లోనికి వెళ్లకుండా ఇనుపరాడ్లు ఏర్పాటు చేశారు. దీంతో 10 నిమిషాలు పార్కింగ్ చేయడానికి వచ్చేవారు తమ వాహనాలను అద్దె చెల్లించి పార్కింగ్ ప్రదేశంలో పెట్టలేక.. ఎక్కడ పడితే అక్కడ పెట్టేస్తున్నారు. తీరా వచ్చేసరికి వాహనాలు దొంగల పాలైపోతున్నాయి.

ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారు...

బస్టాండ్ ముఖద్వారం వద్ద ఖాళీగా ఉన్న ప్రాంతంలో పది నిమిషాలు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి ఆర్టీసీ అధికారులు వీలు కల్పించి ఉంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండేవి కావు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో పలు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనాల చోరీలు పెచ్చుమీరుతున్నాయి.

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ సమాచారం			
	తిరుపతి డిపో సర్వీసులు- 108	రోజు వారీ రాబడి- 90 లక్షలు	బస్టాండ్లు- 04
	ప్లాట్‌ఫాంలు- 64	దుకాణాల ద్వారా ఏడాదికి- 38 కోట్లు	కార్గో పాయింట్- 01
	రోజు వచ్చిపోయే సర్వీసులు- 2,876		తిరుపతి బస్టాండ్ నుంచి విద్యుత్ సర్వీసులు- 50
	రోజు వారీ ప్రయాణికులు- 2 లక్షలు	దుకాణాల సంఖ్య- 214	

ముందు భాగంలో అవకాశం కల్పించాలి

తిరుపతి బస్టాండ్ ముందు భాగంలో వాహనాలను పార్కింగ్ చేయడానికి అవకాశం కల్పించాలి. మా భార్య శ్రీకాళహస్తిలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. తిరుపతి నుంచి రోజూ వెళ్లి వస్తోంది. ఈ క్రమంలో నేను బస్టాండ్‌కు తీసుకువచ్చి బస్సు ఎక్కించి, వెళుతుంటాను. అయితే పది నిమిషాలు పార్కింగ్ చేయడానికి ప్రదేశం కరువు అవుతుంది. పేరుకు తిరుపతి సెంట్రల్ బస్టాండ్.. అయినా కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదు. – మోహన్‌కుమార్, తిరుపతి

వాహనాలను మాయం చేస్తున్నారు

వేలం పాట పాడి పార్కింగ్ నిర్వహిస్తున్న వారికి లబ్ధి చేకూర్చడానికి బస్టాండ్ ముందు భాగంగాలో స్థలాన్ని అధికారులు ఖాళీ పెట్టేస్తున్నారు. గంట పాటు పార్కింగ్ చేయాల్సి వస్తే తప్పకుండా ఆర్టీసీ కాంట్రాక్టు ఇచ్చిన ప్రాంతంలోనే వాహనాలు నిలుపుతాం. అయితే పది నిమిషాలకు రోజూ అద్దెకు వాహనాలను ఎలా పెడుతాం. బస్టాండ్ ముందు భాగంలో అయితే సీసీ కెమెరాలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో పార్కింగ్ చేయడానికి ఖాళీ స్థలం ఉంది. అయితే ఆ స్థలంలో వాహనాలను పెట్టకుండా అధికారులు ఇనుపరాడ్లు పెట్టేశారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ పెట్టేస్తున్నాం. స్కూటర్లు మాయం అవుతున్నాయి. – ధర్మతేజ, తిరుపతి

పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తాం

తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని అన్ని పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తాం. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతాం. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటాం. మరోవైపు బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు చోరీ జరగకుండా అవసరమైన మేరకు చర్యలు చేపడుతాం. – డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి




బస్టాండ్ ముఖద్వారం వద్ద వాహనాలు పెట్టకుండా ఇనుపరాడ్లు ఉన్న ఖాళీ స్థలం, బస్టాండ్ ముఖద్వారానికి తూర్పు వైపున రాడ్లు పెట్టడంతో ఖాళీగా స్థలం

కనీస వేతనాలివ్వాల్సిందే!

- కార్మికశాఖ ఉప కమిషనర్ బాలునాయక్

సాక్షి ఎఫెక్ట్..

రేణిగుంట: 'కబళిస్తున్న కాలుష్యం– ప్రాణాలకు లేదు అభయం' పేరిట ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను చెల్లించి వారికి ఉద్యోగ భద్రత, భరోసా కల్పించాల్సిన బాధ్యత ఆయా కంపెనీల యాజమాన్యాలకు ఉందని కార్మికశాఖ తిరుపతి ఉప కమిషనర్ బాలునాయక్ స్పష్టం చేశారు. ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడుతూ జిల్లాలోని పలు పరిశ్రమలు, ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు వారి పనిని బట్టి కనీస వేతనాలను చెల్లించాలన్నారు. స్థానికులైనా, బయట రాష్ట్రాలకు చెందిన వారైనా వేతనాల విషయంలో వ్యత్యాసాలుంటే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక్క రోజులో 8గంటల కంటే ఎక్కువగా పని చేయించుకున్నా చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని పలుచోట్ల తనిఖీలు చేసి కార్మికుల భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులు తమకు నేరుగా ఫిర్యాదు చేస్తే ఆ కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టారు. మహిళలు మొక్కులు చెల్లించి కొబ్బరికాయలు కొట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, సభ్యులు దువ్వూరు చంద్రశేఖర రెడ్డి పర్యవేక్షించారు.

పెరటి మిద్దె తోటలను ప్రోత్సహించాలి


కార్యక్రమానికి హాజరైన మిద్దె తోటల పెంపకందారులు

తిరుపతి కల్చరల్: పెరటి మిద్దె తోటలను పెంచుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించాలని ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కేటీ.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పద్మావతిపురంలో ఆదివారం ఒన్ ఎర్త్–ఒన్ లైఫ్ ప్రారంభం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగా జీవించాలంటే తప్పనిసరిగా ప్రతి ఇంట్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలు పెంచుకోవాలని సూచించారు. ఇందు కోసం ఒన్ ఎర్త్–ఒన్ లైఫ్ సంస్థ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఇందులో పాల్గొన్న పెరటి మిద్దె తోటల పెంపకందారులకు 30 రకాల విత్తనాలతోపాటు బంతి, చామంతి, మందారం, బచ్చలి, తమలపాకు తదితర మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, భానుప్రియ, శృతి పాల్గొన్నారు.

ప్లీజ్.. హెల్మెట్ పెట్టుకోండి



వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. తిరుపతికి చెందిన ఇద్దరు కళాకారులు కేశవ, శాంబోల్ హరినాథ్ కింకరుల వేషంలో ఈ కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్ పెట్టుకోండి ప్లీజ్ అంటూ వారు అవగాహన కల్పిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జాతీయ రహదారి కూడలి సమీపంలో ఒక టీ దుకాణంలో చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన జగన్నాథం టీ దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కౌంటర్లో ఉన్న నగదు, గ్యాస్ సిలిండర్ తదితర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం జాతీయ రహదారి కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు జగన్నాథం దుకాణంలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారు విన్నమాల గ్రామానికి చెందిన బాల సుబ్రమణ్యం, నాయుడుపేట ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన పృథ్వీగా గుర్తించారు. వారి నుంచి రూ.6 వేల నగదు, గ్యాస్ సిలిండర్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

నాగార్పమ్మ ఆలయంలో విశేష పూజలు



వాకాడు : మండల కేంద్రమైన వాకాడు గ్రామ దేవత నాగార్పమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పొంగళ్లు పెట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోటేశ్వరరావు అమ్మవారికి విశేష అలంకారం, అభిషేకాలు, కుంకుమ పూజ చేశారు.

భక్తిశ్రద్ధలతో వారాహి నవరాత్రి ఉత్సవాలు


ప్రత్యేక అలంకారణలో వారాహి అమ్మవారు, శ్రీచక్ర యంత్ర మహా మేరువు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం 9వ రోజు నవమి సందర్భంగా ఆలయం వద్ద వారాహి అమ్మవారితో పాటు శ్రీచక్ర యంత్ర మహా మేరువుకు పంచామృత అభిషేకాలు చేశారు. మూల మంత్రం, లక్ష్మీ సహస్రన నామ కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్ స్వామి మాట్లాడుతూ కాశీ గ్రామ దేవతగా పిలువబడే వారాహి అమ్మవారికి 9 రోజు లు గుప్త నవరాత్రుల పేరిట ఉత్సవాలను జరుపుకో వడం సంతోషంగా ఉందన్నారు. సోమవారం రాత్రి ఉత్సవాలు ముగింపు పూజలు చేస్తామని పేర్కొన్నారు.


వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు